క్లుప్తంగా

విద్య ఆవశ్యకతపై అవగాహన



తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యడ్ల లింగయ్య కాలనీలో చెత్త ఏరుకుని జీవించేవారికి విద్యా చైతన్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక న్యాయవాది కేసీ బసవయ్య హాజరై, పిల్లలను చదివించుకోవాల్సిన ఆవశ్యకతను వారికి తెలియజెప్పారు. గుంటూరు సిటీ కో–ఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందులో భాగంగా పిల్లల చదువుకు కావాల్సినవన్నీ సమకూరుస్తోందని చెప్పారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయిని సునీత మాట్లాడుతూ, తల్లి గర్భంలో పడిన నాటినుంచి అయిదేళ్ల వయసు వచ్చేవరకు పిల్లలు, తల్లులకు ప్రభుత్వం పోషకాహారం ఇస్తోందని చెప్పారు. తర్వాతనుంచి వారిని చదివించాలని సూచించారు. పట్టణంలోని నాలుగు ఏరియాల్లోని వేస్ట్ పికర్స్‌కు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కో–ఆర్డినేటర్ రాజశేఖర్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సాంఘిక నాటక కళాకారుడు వినయ్‌కుమార్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం మనుషుల్లో దేవుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం పాండవ వనవాసం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు, సినీ, టీవీ ఆర్టిస్ట్ తెనాలి వినయ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఘంటా రవికిరణ్ చౌదరి, చలవాది శివప్రసాద్, గరికపాటి సుబ్బారావు, తెనాలి సునీత, గంజి ప్రసాద్, కంకిపాటి శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, సోమవరపు సాంబశివరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందెబాల చంద్రమౌళి కోరారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.శ్రీనివాసులుతో కలిసి ఉద్యోగుల డిమాండ్లతో కూడిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. చంద్రమౌళి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై రానున్న రోజుల్లో చేపడుతున్న ఉద్యమాలకు ఉద్యోగులందరూ ఐక్యంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి భీమవరపు మధుసూదనరెడ్డి, ఉపాధ్యక్షులు దమ్ము ఆశీర్వాదమ్మ, ఈవోపీఆర్డీ సమతవాణి, జూనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాశరావు, హెల్త్ అసిస్టెంట్ సంగెపు శ్రీనివాసరావు, డీఎస్ఎస్ ఆంజనేయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ బైక్ చోరీపై కేసు నమోదు

తెనాలిరూరల్: బుల్లెట్ బైక్ చోరీపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని జయప్రకాష్ నగర్‌కు చెందిన శ్రీనివాసరావు తన బైక్‌ను ఆదివారం రాత్రి ఇంటి వద్ద పెట్టాడు. సోమవారం ఉదయానికి వాహనం కనబడకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

24న మద్యం నిషేధానికి.. సైకిల్ యాత్ర

తెనాలిటౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి తెనాలి శాఖ ఆధ్వర్యంలో మద్య నిషేధం కోరుతూ ఈ నెల 24న సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ సోమవారం తెలిపారు. గంగానమ్మ పేటలోని చుండూరువారి సత్రం నుంచి బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పీజీ కాలేజ్ వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 5.30గంటలకు చుండూరు వారి సత్రం వద్ద యాత్ర బయలుదేరుతుందని, విద్యార్థులు, యోగసాధకులు పాల్గొనాలని కోరారు. అదే రోజు ఉదయం 7 గంటలకు పీజీ కాలేజ్ ఆడిటోరియంలో మద్యపానం –సమాజంపై దుష్ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో మానసిక వైద్యులు అయినంపూడి శరత్‌బాబు, రావూరి సుబ్బారావు, డాక్టర్ జేఎస్‌వీ సురేష్‌బాబు, ఎం.దశరథరామిరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ర్యాలీలో విద్యార్థులు, యోగసాధకులు పాల్గొని జయప్రదం చేయాలని యోగ మండలి గురుబోధకులు తాడికొండ శ్రీనివాసరావు కోరారు.

సంక్షేమ ఆశయ సారథులు వలంటీర్లు

- కుటుంబ సభ్యుల్లా పరిగణిస్తున్న ప్రజలు
- చిత్తశుద్ధితో పనిచేస్తున్నందునే ప్రభుత్వానికి మంచి పేరొచ్చింది
- వలంటీర్లకు వందనం సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పట్టణంలోని వలంటీరుకు సేవారత్న అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన పేదల చెంతకు చేర్చటంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 90 శాతానికి పైగా వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నందునే ప్రభుత్వానికి, తనకు మంచి పేరొచ్చిందని చెప్పారు. ఇదే తరహాలో రాగద్వేషాలకు అతీతంగా ప్రభుత్వ విధులను నిర్వర్తించాలని సూచించారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తే, ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని ఆయన హెచ్చరించారు. తెనాలి పట్టణంలోని 1–12 వార్డులు, మండలంలోని అంగలకుదురు–1, 2, బుర్రిపాలెం, కఠెవరం–1, 2, కొలకలూరు–3, కంచర్లపాలెం, సంగంజాగర్లమూడి సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో వేర్వేరుగా జరిగాయి. ఆయా సభలకు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, మూడో విడత పురస్కారాల కింద రాష్ట్ర వ్యాప్తంగా 2,33,719 మంది వలంటీర్లకు రూ.243.34 కోట్లను ప్రభుత్వం అందజేసినట్టు చెప్పారు. విప్లవాత్మకమైన వలంటీర్ వ్యవస్థపై దేశంలో అధ్యయనం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనా విధానం, వలంటీర్ల పనితీరు, లబ్ధిదారుల ఆనందం అంశాలపై అధ్యయనం నివేదికలు చూసి, ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థను ప్రవేశపెట్టాలనే ఆలోచిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలు, అగ్ర వర్ణాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తోన్న వలంటీర్లు మరింత సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని కోరారు. వలంటీర్లను ప్రజలు సొంత కుటుంబ సభ్యుల్లా పరిగణిస్తున్నారని సోదాహరణంగా చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల నిర్లక్ష్యానికి, అవినీతికి మూల్యం చెల్లించాల్సి వచ్చినట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. భవిష్యత్తులో వలంటీర్లదే కీలకపాత్రగా చెబుతూ, వలంటీర్లను నాయకులను చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయటమే లక్ష్యం కావాలని దిశా నిర్దేశం చేశారు. టీమ్‌వర్క్ చేద్దామని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాస్, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, వార్డు కౌన్సిలర్ కొర్రా యశోద మాట్లాడారు. వేదికపై పార్టీ నేతలు మన్నవ ప్రభాకర్, బూరెల దుర్గా, కఠారి హరీష్, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ దుబాయ్‌బాబు, కో–ఆప్షన్ సభ్యుడు పెబ్బింగ్ సుభాని, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కాకి దేవ సహాయం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.



వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

వెలకట్టలేనివి వలంటీర్ల సేవలు

అత్తోట(కొల్లిపర): గ్రామ వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండలంలోని అత్తోట, చివలూరు గ్రామ సచివాలయ వలంటీర్లకు సోమవారం అత్తోట గ్రామ సచివాలయంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు సేవాభావంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా పనిచేస్తున్న వలంటీర్లే నాయకులుగా ఎదుగుతారని జోస్యం చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో ఏటా వలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా రూ.1.60కోట్లు ఇస్తున్నట్లు చెప్పారు. మూడేళ్లలో సుమారు రూ.5కోట్లు అందించటం జరిగిందన్నారు. అత్తోట, చివలూరు గ్రామాల్లో 56 వలంటీర్లకు రూ.10వేల చొప్పున సేవా మిత్ర పురస్కారంతో మెడల్ , ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, సర్పంచ్ దేశబోయిన నాగపుణేశ్వరావు, చివలూరు సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి, అవుతు పోతిరెడ్డి, ఎంపీడీవో పి.శ్రీనివాసులు, తహసీల్దారు జి.నాంచారయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



సీఎం వైఎస్ జగన్ మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థలో పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నా. ప్రతి నెలా 4నే రేషను పంపిణీ చేసేస్తున్నాను. పింఛన్ల పంపిణీతో సహా ఎన్నో సంక్షేమ పథకాలకు నా చేతుల మీదుగా అర్హులను గుర్తించటం గొప్ప విషయం. ఐదు సూత్రాలను పాటిస్తూ సమర్థంగా సేవలందిస్తున్నాను.

– తురుమెళ్ల వెంకటసత్య ఫణికుమార్, వలంటీరు.

సంక్షేమ వారధిని నేను..



ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధిలా విధులు నిర్వర్తించటం చాలా సంతోషంగా ఉంది. పేద ప్రజలకు సంక్షేమం అందించటం కన్నా గొప్ప విషయం ఏముంటుంది..? ఏ ఉద్యోగంలోనైనా ఇంతకన్నా ఆత్మ సంతృప్తి ఉంటుందా? నా పరిధిలోని కుటుంబాలు నన్ను గౌరవిస్తున్నాయి.

– కాకాని లక్ష్మి, వలంటీరు.

పవర్ లిఫ్టర్ షబీనాకు సత్కారం

తెనాలి: ప్రతిభ, పట్టుదల కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. ఆసియా పోటీల్లో నాలుగు బంగారు పతకాలను సాధించిన పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ షేక్ షబీనా ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్, తమిళనాడులో జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలను సాధించిన షబీనాను సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబరులో ఆమె సత్కరించారు. షబీనాను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని చైర్‌పర్సన్ గుర్తుచేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



షబీనాను సత్కరించిన చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

వీర్లంకమ్మకు విశేష పూజలు



కర్లపాలెం: పెద పులుగువారిపాలెంలో నూతనంగా ప్రతిష్ఠించిన చిన అక్కలవారి ఇలవేల్పు వీర్లంకమ్మ అమ్మవారికి సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆలయంలో వీర్లంకమ్మ, పోతురాజు స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించి 16 రోజులైన సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. చిన అక్కలవారి వంశస్థులతో పాటు గ్రామంలోని భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని, పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించారు.

చికిత్స పొందుతూ అవనిగడ్డ వాసి మృతి

కొల్లూరు: రోడ్డు ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనదారుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం ఏకనూరుకు చెందిన తూగల శ్రీనివాస పెరుమాళ్లు (62) ఈ నెల 10న తన ద్విచక్ర వాహనంపై గుంటూరుకు వ్యక్తిగత పనిపై వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మండలంలోని దోనేపూడిలో కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవడంతో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వైద్యశాల నివేదిక, మృతుడి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజీవ్‌కామ్యూల్‌కుమార్ తెలిపారు.

సీపీఎం సీనియర్ నేత సాంబశివరావు మృతి



తెనాలిటౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు వల్లభనేని సాంబశివరావు (72) అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు కె.బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ సంతాపం వ్యక్తం చేశారు. సాంబ శివరావు సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు వారు తెలిపారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన సాంబశివరావు 1969లో పార్టీ రాష్ట్ర రాజకీయ పాఠశాల చిలువూరులో జరిగిన సందర్భంలో వలంటీర్‌గా పనిచేశారని తెలిపారు. 1971లో యువజన సంఘం గ్రామ కార్యదర్శిగా, 1973 నుంచి తాలూకా యువజన సంఘం కార్యదర్శి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా, తెనాలి కార్యదర్శిగా ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మంగళవారం సాంబశివరావు స్వగ్రామం తుమ్మపూడిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయన మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, షేక్ అహ్మద్ హుస్సేన్, పోస్టల్ నాయకులు పి.జోసేఫ్, మహిళా సంఘం కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వివాహితకు అసభ్యకర ఫోన్‌కాల్స్

తెనాలిరూరల్: వివాహితకు ఫోన్ చేసి అసభ్యకరంగా వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన ప్రతాప్ తనకు తెలిసిన అదే గ్రామానికి చెందిన సురేష్ వద్ద కొంత మొత్తం గతంలో అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రతాప్‌కు లాయర్ నోటీసు పంపాడు. అప్పటి నుంచి సురేష్ ఫోన్ చేస్తే ప్రతాప్ సమాధానం ఇవ్వడంలేదు. దీంతో తనకు సురేష్ ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ప్రతాప్ భార్య పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు..రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హాస్య నట చక్రవర్తి కాళిదాసు కోటేశ్వరరావు

నేడు 29వ వర్ధంతి సేవా కార్యక్రమాలు

తెనాలి: నిరుపేద కుటుంబంలో జన్మించి, నటనను వృత్తిగా చేసుకుని హాస్య నట చక్రవర్తిగా కీర్తి పొందిన నటుడు కాళిదాసు కోటేశ్వరరావు. 29వ వర్ధంతి రోజైన మంగళవారం స్థానిక బోసు రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ మహా నటుడి జీవిత విశేషాలు.

ప్రముఖ నాటకాల్లో హాస్య పాత్రను ప్రధాన పాత్రలకు ధీటుగా చతుర సంభాషణలతో, హద్దులు మీరని హాస్యాభినయంతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తిన కాళిదాసు కోటేశ్వరరావు స్వస్థలం తెనాలి. ఆయన 1925లో జన్మించారు. తొలుత ఎమ్యూజ్‌మెంట్ పార్కులో హాస్య పాత్రధారిగా చేశారు. మిత్రుల ప్రోత్సాహంతో నాటక రంగ ప్రవేశం చేసి, స్వయం కృషితో ఎదిగారు. కాళిదాసు నాటకంలో కాశుడు, బాలనాగమ్మలో తిప్పడు, చింతామణిలో సుబ్బిశెట్టి, వర విక్రయంలో సింగరాజు/లింగరాజు, సక్కుబాయిలో కాశీపతి, తులాభారంలో వసంతకుడు పాత్రల్లో జీవించారు. కాళ్లకూరి నారాయణరావు నాటకం చింతామణికి సుబ్బిశెట్టి పాత్రధారిగా కోటేశ్వరరావు నటన గొప్ప ఆకర్షణ. 'సంభాషణల్లో సభ్యతకు లోటుండేది కాదు. చౌకబారు చేష్టలకు తావుండేది కాదు' అనిపించుకున్నారు. బాలనాగమ్మ నాటకంలో వల్లూరు వెంకట్రామయ్య మాయల మరాఠీ పాత్రలో రంగస్థలంపై బీభత్స, భయానక రసాలతో నటిస్తుంటే తిప్పడు వేషంలో కాళిదాసు ధీటైన హాస్యాన్ని పండించారు. 1967లో గోపాలకృష్ణ నాట్య మండలి పేరుతో నాటక సమాజాన్ని స్థాపించారు. బృందావనం అనే నాటకాన్ని ఆడారు. తెనాలిలో నాటి విద్యాశాఖ మంత్రి భవనం వెంకట్రావు అధ్యక్షత వహించిన ఓ సత్కార సభలో కోటేశ్వరరావుకు కనకాభిషేకం చేశారు. నన్నపనేని వెంకట్రావు, మోదుకూరి జాన్సన్, వల్లూరు వెంకట్రామయ్య, కన్నెగంటి నాసరయ్య, బొల్లిముంత శివరామకృష్ణ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం తొలి అధ్యక్షుడిగా కోటేశ్వరరావు పనిచేశారు. అప్పట్లో సినీ రజతోత్సవాల్లో భాగంగా తెనాలి వచ్చిన ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావును కళాకారుల సంఘం తరపున కోటేశ్వరరావు సత్కరించారు. ఆ మహా నటుడు కన్నుమూశాక, కాళిదాసు అభిమానులు బోసురోడ్డులో ఆయన విగ్రహాన్ని నెలకొల్పి నివాళులర్పిస్తున్నారు.



కాళిదాసు కోటేశ్వరరావు



సుబ్బిశెట్టి పాత్రలో...

నేటి నుంచి రామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవాలు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పట్టాభిషేక మహోత్సవాలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, బృందావనం గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, 24న 108 కలశాలతో జ్యేష్టాభిషేక మహోత్సవం, 25న ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12.45గంటలకు సీతారామచంద్రస్వామికి పట్టాభిషేక మహోత్సవం, అనంతరం పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'సొసైటీ'లో అవకతవకల ఆరోపణలపై విచారణ

బాపట్ల: బాపట్ల పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెం ఆది ఆంధ్ర కో–ఆపరేటివ్ కలెక్టింగ్ ఫార్మింగ్ సొసైటీలో అవకతవకలపై విచారణ ప్రారంభమైంది. తహసీల్దార్ సుధారాణి సోమవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారుడు దగ్గుమల్లి ధర్మరావుతోపాటు మిగిలిన సభ్యులు విచారణలో పాల్గొన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను తహసీల్దార్‌కు వివరించారు. కమిటీ సభ్యులు అడే రవికుమార్, యాతం మోజేస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవిందనామ సంకీర్తన యజ్ఞంకు ఆహ్వానం

తెనాలి: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం, శ్రీ సాయిరాం సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 6–12 సంవత్సరాల చిన్నారులతో గోవిందనామ సంకీర్తన యజ్ఞం చేపడుతున్నట్టు నిర్వాహకులు సోమవారం విలేకరులకు వెల్లడించారు. లక్కరాజు కనకదుర్గ పర్యవేక్షణలో 108 మంది చిన్నారులతో గోవిందనామ సంకీర్తన చేయదలచినట్టు తెలిపారు. సంప్రదాయ దుస్తులతో తిరునామం ధరింపజేసిన పిల్లలతో రెండు నిముషాలకు మించకుండా గోవిందనామ సంకీర్తనలు చేయించిన వీడియోలను 92464 40685 నంబరుకు వాట్సాప్ చేయాలని కోరారు. జూన్ 3 లోగా పంపిన వీడియోలను పరిశీలించి, ఉత్తమ సంకీర్తన చేసిన పిల్లలకు నగదు, జ్ఞాపికలను అందజేస్తామని తెలిపారు. పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు ఉంటాయని తెలిపారు. చిన్న పిల్లల్లో భక్తిభావం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నిర్వాహకులు కొండపి వసుంధర, శ్రీనివాసరావు, వఝుల లక్ష్మీసునీత, లక్కరాజు కనకదుర్గ పాల్గొన్నారు.



సంకీర్తన యజ్ఞం నిర్వాహకులు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిఉండాలి

తెనాలి: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం రంగు కాగితాలతో రకరకాల పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, న్యూస్ పేపరుతో వివిధ రకాల టోపీలు తయారీపై శిక్షణనిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురం ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంద్రజాలం ప్రదర్శించి చూపారు. చిన్న చిన్న అంశాలను విద్యార్థులతో చేయించారు. ఎలాంటి మాయలు మంత్రాలు లేవని, వాటిలో కేవలం సైన్స్ సూత్రాలే ఉన్నాయని వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని కలిగివుండాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు అహ్మద్ హుస్సేన్ జాతీయ గీతాలు, దేశభక్తి గేయాలను నేర్పించారు. గ్రేడ్–1 గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, రికార్డ్ అసిస్టెంట్ లావణ్య సుధా పర్యవేక్షించారు. శిక్షణకు అవసరమైన సామగ్రిని గ్రంథాలయ తరపున ఉచితంగా సమకూర్చారు.



పువ్వులు, కార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి ఉత్సవాలు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేశారు. వంశ పారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైదిక క్రతువును పండితులు, అర్చకులు కిరణ్, సురేష్‌లు జరిపారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రవచనం చేయగా, సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, కార్యనిర్వాహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి అధ్యక్షులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యా రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సీతారాముల కల్యాణం

'స్పందన'తో సమస్యలకు పరిష్కారం

రేపల్లె: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అర్జీలు స్వీకరించారు. కుల ధృవీకరణ పత్రానికి 2, రోడ్డు సర్వే చూపించాల్సిందిగా 2, ఫిషరీస్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు 1, అండగల్ పేర్లు తొలగించాలని 1, ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని 1, ఎంకరేట్‌మెంట్ ఇఫ్ ఇరిగేషన్ కెనాల్ సర్వే చేయించాలని కోరుతూ 1 చొప్పున అర్జీలు అందాయని తెలిపారు. అర్జీలను పరిశీలించి పరిష్కరించటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

ఘనంగా జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



నగరం: శ్రీనివాస నామస్మరణతో జిల్లేపల్లి గ్రామం మార్మోగింది. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. దిట్టకవి వెంకటలక్ష్మణాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రయుక్తంగా ధ్వజస్తంభ, వినాయక, అభయాంజనేయ స్వామి, గరుడ ఆళ్వార్ ద్వార పాలకుల ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కోలాట భజన సంకీర్తన భక్తులను విశేషంగా అకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు సౌభాగ్యరావు, జంజనం హేమశంకర్రావు, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

25న 'ఆణిముత్యాలు' అవార్డు ప్రదానంపై సమీక్ష

వేమూరు: పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను సత్కరిస్తున్నట్లు ఎంఈఓ కాజ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల విద్యా శాఖాధికారులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న వేమూరు నియోజకవర్గ కేంద్రంలో 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుల ప్రదానంపై సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి చీకటి రవి కాంత్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్‌పై బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక గ్రామంలో దాడి చేయడాన్ని నిరసిస్తూ తెనాలి బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. కోర్టు ఆఫీసర్లుగా వెళ్లిన న్యాయవాదులు ఎంఎల్ జగదీశ్వరాంబ, షేక్ ఖాదర్ హుస్సేన్‌ను దుర్భాషలాడడమే కాకుండా ఖాదర్ హుస్సేన్‌పై దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. విధులు బహిష్కరించారు. కోర్టు ప్రాంగణం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, తాడిబోయిన శ్రీనివాసరావు, షేక్ ఖాదర్ హుస్సేన్, సోలాశంకర్ తదితర న్యాయవాదులు నిరసనలో పాల్గొన్నారు.